క్లుప్తంగా

మాన్యగూడ జట్టుకు ద్వితీయ బహుమతి


మాన్యగూడ వాలీబాల్ జట్టు

కందుకూరు: హిందూవాహిని వీరపట్నం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం శేరిగూడ సమీపంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో మండల పరిధిలోని మాన్యగూడ జట్టు ద్వితీయ బహుమతిని దక్కించుకుంది. మొత్తం 210 టీంలు పాల్గొనగా ఆదివారం రాత్రి పెద్దూర్ జట్టుతో తలపడ్డ మాన్యగూడ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జట్టు సభ్యులకు నిర్వాహకులు రూ.22 వేల నగదుతో పాటు షీల్డ్‌ను అందించారు. క్రీడాకారుల్ని గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందించారు.

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న మామిడి హరికృష్ణ

హస్తినాపురం: స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించి వాటిని వినియోగించుకున్నప్పుడే గ్రామీణ ప్రాంత ఉత్పత్తిదారులు అభివృద్ధి చెందుతారని భాషా సాంస్కృతిక శాఖ డైరక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. జాతీయ గీతం రచించిన రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను స్థానిక ఉత్పత్తుల కేంద్రం నిర్వాహకుడు భరత్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీజీ స్థానిక ఉత్పత్తులను వినియోగించాలని పిలుపునిచ్చారని, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభాకర్, శారద, ధీరజ్, శ్రీనివాసరావు, రమేశ్‌రెడ్డి, కాంతారావు, హరిగోపాల్ పాల్గొన్నారు.

నేడు మాసబ్ చెరువు వద్ద ధర్నా

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధి మాసబ్ చెరువులో చేపడుతున్న అక్రమ కట్టడాలను అరికట్టడంతోపాటు చెరువును మళ్లీ రీసర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిలపక్షం, మాసబ్ చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు అఖిలపక్ష నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు చెరువు వద్ద చేపట్టనున్న ఈ ధర్నాకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు, విద్యార్థి, యువజన సంఘాల సభ్యులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం: కార్పొరేటర్


కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధి సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో సోమవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ శానిటేషన్, ఆర్‌డబ్ల్యూఏ ఇంట్రాక్టివ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై కాలనీవాసులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఈ దామోదర్‌రావు, వాటర్‌వర్క్స్ మేనేజర్ సరివెన్నల, అధికారులు సుదర్శన్,జానకీరాం, నరేందర్‌రెడ్డి, రవీందర్, సంజీవరెడ్డి, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, యూనుస్, కృష్ణరెడ్డి, గోపి పాల్గొన్నారు.

20న బీఆర్ఎస్ యువ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: యువతకు ఎల్లప్పుడు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అండగా ఉంటున్నారని ఇబ్రహీంపట్నం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, పోచారం ఉపసర్పంచ్ భగీరథసాగర్ అన్నారు. తుర్కగూడలో సోమవారం వారు మాట్లాడుతూ.. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే నియోజకవర్గ యువ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన విభాగాల అధ్యక్షులు గణేశ్‌గౌడ్, జలేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా డబుల్ రోడ్డు పనులు

- రూ.14.20 కోట్లతో తుమ్మలూరు-మహేశ్వరం బీటీ రోడ్డు నిర్మాణం
- మారనున్న తుమ్మలూరు, మహేశ్వరం రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు


కొనసాగుతున్న తుమ్మలూరు-మహేశ్వరం డబుల్ రోడ్డు పనులు

మహేశ్వరం: తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో తుమ్మలూరు-మహేశ్వరం డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.14.20 కోట్ల నిధులు మంజూరు చేయించారు. గత నెలలో ప్రారంభమైన డబుల్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తుమ్మలూరు గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక ఉన్న రోడ్డు ఇరుకుగా, గుంతలమయంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. గ్రామస్తులు, ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, అత్యవసరంగా కంకర రోడ్డు నుంచి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు డబుల్ రోడ్డు నిర్మాణం కానుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరి సహకారంతోనే..

తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల రైతులతో ప్రజాప్రతినిధులు మాట్లాడి రోడ్డును వెడల్పు చేసేందుకు చర్యలు చేపట్టారు. తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వరకు రోడ్డును జేసీబీ, డోజర్ల సహకారంతో ముళ్లచెట్లను తొలగించి వెడల్పు చేశారు. రోడ్డు ఎత్తు ఉన్నచోట మట్టిని తొలగించి గుంతలుగా ఉన్నచోట పోసి చదును చేస్తున్నారు. రోడ్డు మధ్యలో కాల్వలు ఉన్న చోట10 కల్వర్టులు నిర్మాణం చేయడానికి పైపులు వేయడం జరిగింది. రోడ్డుపై మట్టిపోసి పూర్తిగా చదును చేసి కంకర పరిచిన తర్వాత బీటీ వేయనున్నారు. ఇళ్ల దగ్గర్లో సీసీ రోడ్డు నిర్మాణం చేయనున్నారు.

33 ఫీట్ల వెడల్పుతో..

శ్రీశైలం జాతీయ రహదారి తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి స్థానిక మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని 5.1 కిలో మీటర్ల దూరానికి , 33 ఫీట్ల వెడల్పు రోడ్డు నిర్మాణానికి రూ.14.20 కోట్ల నిధుల మంజూరు చేశారు. 23 ఫీట్ల రోడ్డు నిర్మాణం , రోడ్డు ఎడమ,కుడి పక్కల చేరొ ఐదు ఫీట్ల మట్టిని పోసి నిర్మాణం చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు..గతంలో ఈ రోడ్డు ఇరుకుగా,గుంతలమయంగా ఉండేది.డబుల్ రోడ్డు నిర్మాణం కానుండడంతో ఈ రోడ్డుపైన వాహనాల రాకపోకలు జోరుగా జరగనున్నాయి.

డబుల్ రోడ్డుతో తీరనున్న ఇబ్బందులు....

తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారి నుండి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణం కానుండటంతో మహేశ్వరం నియోజకవర్గ కేంద్రానికి రావడానికి సులువుగా ఉంటుంది.అంతే కాకుండా కల్వకుర్తి, ఆమనగల్, కడ్తాల్, కందుకూరు, ఇబ్రాహీంపట్నం, యాచారం నుంచి మహేశ్వరం రావడానికి ఈ రోడ్డు గుండా వెళ్లడానికి అనువుగా ఉంటుంది. ఇది వరకు మహేశ్వరం గేటు నుంచి వెళ్లేవారు ఈ రోడ్డు నిర్మాణంతో తుమ్మలూరు గేటు, తుమ్మలూరు గ్రామం గుండా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రానికి తొందరగా చేరుకోవచ్చు. శ్రీశైలం-బెంగుళూరు జాతీయ రహదారులను ఈ రోడ్డు కలుపుతుంది. డబుల్ రోడ్డు నిర్మాణంతో తుమ్మలూరు, మహేశ్వరం గ్రామాల రైతుల భూముల విలువ పెరగడంతో పాటు అభివృద్ధి జరుగుతుంది.

మంత్రికి కృతజ్ఞతలు



ఏళ్లుగా ఎదురు చూస్తున్న తుమ్మలూరు-మహేశ్వరం బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి సబితారెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు .గతంలో ఇరుకుగా, గుంతలమయంగా కంకర తేలుతూ రోడ్డు అధ్వానంగా ఉండేది. మంత్రి ప్రత్యేక చొరతో రూ.14.20 కోట్లు మంజూరు చేయించారన్నారు.

– మద్ది సురేఖారెడ్డి, సర్పంచ్, తుమ్మలూరు

నెల రోజుల్లో పూర్తిచేస్తాం

తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారి-మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు గ్రామం బీటీ డబుల్ రోడ్డును 5.1 కిలో మీటర్ల దూరం, 33 ఫీట్ల వెడల్పుతో నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లను తొలగించడంతో పాటు వెడల్పుగా చేసి ఎత్తుగా ఉన్నచోట్ల మట్టిని తొలగించి గుంతలు, వంపుగా ఉన్నచోట మట్టిని పోసి రోలర్‌తో చదును చేపట్టాం. 10 చోట్ల కల్వర్టులను గుర్తించి పైపులు వేస్తున్నాం. నెల రోజుల్లో రోడ్డు పనులను పూర్తిచేస్తా.

– వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, మహేశ్వరం

సింగిల్ రోడ్లను విస్తరిస్తాం



నియోజకవర్గంలో ఇరుకుగా ఉన్న బీటీ రోడ్లను గుర్తించి డబుల్ రోడ్లుగా విస్తరిస్తాం. ఇటీవల మన్సాన్‌పల్లి-కోళ్లపడకల్ వయా ఘట్టపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ నుంచి రూ. 15.20 కోట్ల నిధులు మంజూరు చేయించాము. త్వరలో టెండర్లు పిలిచి ఆ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. మహేశ్వరం మండల కేంద్రం నుంచి మన్సాన్‌పల్లి చౌరస్తా, నాగారం, పెద్ద గోల్కొండ వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి రూ. 24 కోట్లు ప్రతిపాదనలు పంపించాం. లేమూరు డబుల్ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయిస్తాం.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

మంత్రాలచెరువులో పూడికతీత పనులు



మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువులో సోమవారం పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఈ గోపీనాథ్ మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా హెచ్ఎండీఏ నిధులతో పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు. మంత్రి సబితారెడ్డి ఆదేశాల మేరకు ఓ వైపు సుందరీకరణ పనులు చేపడుతూనే, మరోవైపు పూడికతీత పనులను 15 రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీ గణపతిస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలుసోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. మరో రెండు రోజుల పాటు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని, మంగళవారం శివపార్వతుల కల్యాణం, 10వ తేదీన సిద్ధి, బుద్ధి గణపతి కళ్యాణం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకోవాల్సిందిగా కోరారు. కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని పౌరులకు అందించాలి

ధర్మ సమాజ్ పార్టీ


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

కందుకూరు: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆ పార్టీ మండల ప్రచార కమిటీ సభ్యుడు అమరేందర్ మహరాజ్ మాట్లాడుతూ.. భారత దేశాన్ని నడిపిస్తున్నది రాజ్యాంగమేనని, అలాంటి గ్రంథం పట్ల నూటికి 90 శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ, ప్రజాస్వామ్యం విఫలమవుతుందన్నారు. భారత రాజ్యాంగాన్ని పంపిణీ చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే తాము పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ సభ్యులు మహేశ్, యాదగిరి, వంశీ, ప్రకాష్, సుధాకర్, ప్రవీణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

90 శాతం మందికి అవగాహన లేదు..

మహేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్‌పార్టీ నాయకులు సోమవారం మహేశ్వరం తహసీల్దార్ మహమూద్ అలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, దుబ్బచర్ల ఉపసర్పంచ్ దేవేందర్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగం పట్ల 90 శాతం మంది ప్రజలకు అవగాహన లేక పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విఫలమవుతుందన్నారు. ఒక వేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన సమయంలో స్పందించకపోతే ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఆ పార్టీ నాయకులు ఆంజనేయులు, రవి, రాజు, అనోక్, ఉమాశంకర్, ఆకాష్, జాషువా, పరమేష్, భరత్, శ్రీకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

మంత్రి సబితారెడ్డి


సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివగంగ ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు

మహేశ్వరం: ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఆ ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న పురాతన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రసిద్ధ శైవ క్షేత్రంగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గంలోని 5 పురాతన ఆలయాలు మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయం, తుక్కుగూడ వెంకటేశ్వర ఆలయం, బాలాపూర్ వేణుగోపాలస్వామి ఆలయం, జిల్లెలగూడ వేంకటేశ్వర ఆలయం, ఆర్‌కేపురం కిల్లా మైసమ్మ ఆలయాల అభివృద్ధికి ఒక్కో ఆలయానికి కోటి రూపాయాల చొప్పున 5 ఆలయాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. మంజూరైన నిధులతో ఆలయాల్లో మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మహేశ్వరంలో ఇంద్రారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయాలన్ని పెద్దఎత్తున నిర్మాణం చేపట్టడంతోపాటు కొత్వాల్ చెరువు కట్టపైన 40 అడుగుల భారీ శివుడి విగ్రహం ఏర్పాటు, శివగంగ ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్, ఆలయ ఈఓ మురళీకృష్ణ, జిల్లా రైతు కమిటీ సభ్యులు యాదయ్య, ఆలయ డైరెక్టర్లు చంద్రయ్య, బాల్‌రాజ్, మహేందర్ ముదిరాజ్, రవి, శివగంగ ఆలయ మాజీ చైర్మన్లు నవీన్, కుమార్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్



ట్రోఫీ అందజేస్తున్న వీరేందర్ గౌడ్, నిర్వాహకులు

మహేశ్వరం: క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే1న ప్రారంభమైన భజరంగ్‌దళ్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతలకు వీరేందర్‌గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతిరోజు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా దేవేంద్ర ఫౌండేషన్ పని చేస్తుందన్నారు. భవిష్యత్తులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కగా హర్షగూడ జట్టు విన్నర్‌గా, నాగారం జట్టు రన్నర్‌గా నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.30 వేల నగదు, ట్రోఫీ, రన్నర్‌కు రూ.16 వేల నగదు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకులు పాపయ్యగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్యగౌడ్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, సురేష్, శ్రీశైలం, హరిలాల్, యుగేందర్, మోహన్ నాయక్, శ్రీహరి, మహేష్ యాదవ్, రవితేజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ధరణి సమస్యలను పరిష్కరించండి'

మంచాల: ధరణిలో నెలకొన్న సమస్యలను తక్షణమే సరిచేయాలని బండలేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ తిరుపతిరావుకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి కంటే ముందు రైతుల సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేవని అన్నారు. ధరణి వచ్చిన తర్వాత కనీసం ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యలపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా పరిష్కారం లభించడం లేదన్నారు. తక్షణమే ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలన్నారు. రైతులు జంగయ్య, గండయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల నిరసన

కందుకూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు, జిల్లా నాయకుడు వెంకటయ్య, వీఓఏల నాయకురాలు పి.శారద మాట్లాడుతూ.. రోజుల తరబడి రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వంలో చలనమే లేదని విమర్శించారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో వీఓఏలు రమ్య, పద్మ, పావని, రజని, మంగ, కల్పన, కవిత, సీఐటీయూ నాయకులు కుమార్, ఎస్.బాలకృష్ణ, గాదె సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న వీఓఏలు

ఘనంగా అన్నమయ్య జయంత్యోత్సవం

వనస్థలిపురం: స్థానిక హిల్ కాలనీలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి 108 అన్నమయ్య పదపల్లవుల స్వర-నృత్య నీరాజనం కార్యక్రమం కనుల పండువగా జరిగింది. తాళ్లపాక అన్నమాచార్య 615వ జయంత్యోత్సవం సందర్భంగా శ్రీ స్వరలయ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, అన్నమయ్య భావనా వాహిని వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, ప్రముఖ నాట్యాచారులు డాక్టర్ పసుమర్తి శేషబాబు, సంగీత దర్శకులు రామాచారి తదితరులు హాజరై అన్నమయ్య కీర్తనల గొప్పతనాన్ని ఆహూతులకు వివరించారు. 108 మంది విద్యార్థులు ఒకేసారి ఒకే వేదికపై స్వర నృత్య నీరాజనం చేయడం గొప్ప విషయమ న్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డుగా నమోదు చేసి సంబంధిత పత్రాలను నిర్వాహకులకు అందించారు. ప్రముఖ సంగీత దర్శకుడు చల్లా దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్ నందకిశోర్, గ్లోబల్ అడ్వయిజర్ డాక్టర్ సతీష్ శిఖ, కే.శ్రీకాంత్, సంస్థ డైరెక్టర్లు దిలీప్‌రాజన్, సౌజన్య రాజన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న సర్కార్

యువ సంఘర్షణ సదస్సుకు తరలిన కాంగ్రెస్ నాయకులు


కందుకూరు నుంచి బయలుదేరిన నాయకులు


హుడాకాంప్లెక్స్: ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నేతలు

కందుకూరు: సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంఘర్షణ భేరి సదస్సుకు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి మహ్మద్ అఫ్జల్‌బేగ్, నాయకులు సొడవు వెంకటేష్‌గౌడ్, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో చౌరస్తా నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. నిరుద్యోగులను బీఆర్ఎస్ సర్కార్ మోసం చేస్తోందన్నారు. నోటిఫికేషన్లు విడుదల చేయకుండా.. ఇచ్చిన నోటిఫికేషన్ల పేపర్లు లీకేజీ చేస్తూ యువత జీవితాలతో ఆడుకుంటోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, నారాయణ, సుధాకర్, నర్సింహ, బాబు, అశోక్, సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణ, దేవేందర్, నర్సింహ పాల్గొన్నారు.

బడంగ్‌పేట నుంచి..

రంగారెడ్డి జిల్లా: సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ నిరసన సంఘర్షణ సభకు సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. బడంగ్‌పేటలోని పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలు దేరి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి అక్కడి నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. తెలంగాణలోని నిరుద్యోగ యువకులు పడుతున్న గోసను తూర్పారపడుతూ.. అలాగే నిరుద్యోగులకు అండగా ఉండేందుకు ఏఐసీసీ నాయకురాలు ప్రియాంక గాంధీ ముఖ్యులుగా విచ్చేయుచున్నారని అన్నారు. తరలివెళ్లినవారిలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి బంగారు బాబు, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, సంతోషి, సుదర్శన్‌రెడ్డి, మనోహర్, బాలునాయక్, నాయకులు పాల్గొన్నారు.

దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న యువ సంఘర్షణ సభకు విచ్చేస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీకి స్వాగతం పలికేందుకు సోమవారం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి సభా ప్రాంగణానికి ర్యాలీగా బయలుదేరారు. దీంతో ప్రధాన రహదారులంతా కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు, జెండాలతో నిండిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమైందన్నారు. ర్యాలీలో రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ మధుసూదన్‌రావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, పున్న గణేష్‌నేత, చిక్కుళ్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి


ఆమనగల్లు: వంటావార్పుతో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

11వ రోజుకు చేరుకున్న జేపీఎస్‌ల సమ్మె

ఆమనగల్లు: జూనియర్ పంచాయితీ కార్యదర్శుల ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదిలాల్, ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్, ఔట్‌సోర్సింగ్ గ్రామ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారంతో 11వ రోజుకు చేరుకుంది. నిరసన కార్యక్రమంలో భాగంగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు మంజుల, లచ్చి, ప్రేమలత, శ్రీనయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, మహేశ్వరం డివిజన్ గ్రామ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జావిద్ పాల్గొన్నారు.

చర్చలకు పిలవాలి..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్, ఔట్ సోర్సింగ్ గ్రామ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారం 11వ రోజుకు చేరుకుంది. సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ సోమవారం ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ఆ పార్టీ నాయకులు యాదయ్య, సామేల్, జగదీశ్, అలంపల్లి నర్సింహ, బుగ్గరాములు జంగయ్య పాల్గొన్నారు.